# అందరియందున్న ఆత్మ ఒక్కటే

జాతి భేదము లేక జనుల కాశ్రయమిచ్చి
సర్వసమత్వంబు చాటు తరులు
తనువుపై మనకింత తమకంబు తగదంచు
చలిఎండ వానల సైచు గిరులు
రేపు మాపటికంచు వాపోవ వలదంచు
విహగముల్ సంతుష్టి విద్య గరపు
తనువు నిత్యము కాదు సంసారమది భ్రాంతి
అని దేహమును వీడిచనెడివారు
నాది నేనను భ్రాంతి అనర్థమంచు
ఏడ్చు ప్రకృతి జనని బాష్పవృష్టి తెల్పు
ప్రాణ జీవించ ప్రకృతియె పాఠశాల
సద్గురుడు సాయి శ్రీహరి కాదె జూడ.

**ప్రేమస్వరూపులారా!**

నీరు పోసి పెంచినవ్యక్తికైనను, హింసించిన వ్యక్తికైనను చల్లని ఛాయను తియ్యని ఫలమును అందించి వృక్షములు సమత్వమును ప్రబోధిస్తున్నాయి. ఇట్టి ప్రబోధలు మానవత్వమునకు అనాదికాలమునుండి జరుపుచూ ఉండినప్పటికిని మానవుడు ఇంకను కన్ను తెరవలేదు. స్వజాతి విజాతి స్వమత భేదములు త్యజించి సమత్వముగా మానవత్వమును వహించి దివ్యత్వమును ప్రబోధించే ఈ ప్రకృతియొక్క తత్త్వాన్ని వ్యక్తులు అర్థం చేసుకోవటం లేదు. వృక్షములే ఇంతటి పాఠములు నేర్పుచుండగా మానవత్వమును ఎందుకు తాను గుర్తించుకోలేకపోతున్నాడు. అనే విషయము ఈనాడు యోచించాలి. ప్రతి మానవునకు వృక్షములే ప్రధానగురువు.

**తనువుపై మనకింత తమకంబు తగదంచు**

sri sathyasai vahini amrutam

**చలిఎండవానలసైచు గిరులు**

దేహముయొక్క తత్వాన్ని మానవుడు అనేక అభిమాన మమకారములచే పెంచుకొని దానికి బద్ధుడై దాసుడై కేవలము తన దివ్యత్వమును తాను మరచిపోతున్నాడు. ఈ అభిమానమమకారముల చేతనే మానవుడు ఈ తుచ్ఛమైన శరీరమును అనేక విధములుగా ఆధారము చేసుకొని దివ్యత్వమైన ఆధేయమైన ప్రకృతిని విస్మరించి తాను స్వార్థమునందు మునిగిపోతున్నాడు.

సుఖ దుఃఖములను సమత్వమునందుంచుకొని పవిత్రమైన జీవితము గడపమని సర్వమతములుకూడను బోధిస్తున్నాయి. చలి అనిపర్వతములు ఏ రగ్గును ధరించటంలేదు. ఎండలు అధికముగా ఉన్నవనియే hill stationకు వెళ్ళటం లేదు. ఏ airconditioning వేసుకోటం లేదు. వానలు ఏవిధంగా భరించాలని భ్రాంతిచేత తాను ఏ గొడుగులు పట్టటం లేదు. కేవలము ఈ చలి, ఎండ, వానలు దేహమునకు మాత్రమే కాని ఆత్మకు లేవనే సత్యాన్ని గుర్తించుకున్న పర్వతములు మానవునకు అనేకవిధములుగా ప్రబోధలు సలుపుతూ వచ్చాయి. ఇది రెండవ గురువు.

**రేపు మాపటికంచు వాపోవ వలదంచు**
**విహగముల్ సంతుష్టి విద్యగరపు.**

పక్షులు అప్పటికప్పుడు ఆకలివేసినప్పుడు ఏదో ఒక ప్రదేశమునకు వెళ్ళి తను పొట్టను నింపుకొని ఆనందముగా సుఖముగా శాంతిగా జీవితము గడుపుతున్నవి. కానీ రేపు మాపు అని ఈ 5 year plan వేసుకొని ఈ తిండి తీర్థాదులనిమిత్తమై అనేక శ్రమలు పడటంలేదు. మానవ జీవితము రేపు మాపని ఏ మాత్రము ఆధారములు లేవు. రేపు ఏమి కానున్నదో రేపటివరకు మనము ఇచ్చట నిల్చేటటువంటి సత్యము ఏమిటి? ఈ విధమైన నీటి బుడగవంటి జీవితమునకు రేపు మాపు అని అనేకవిధములుగా మనము ప్రాకులాడి ఈ జీవిత కాలమును వ్యర్థము గావించుకుంటున్నాము. ఇది మానవత్వమునకు తగిన దివ్యత్వము కానేరదని పక్షులు కూడను అనేకవిధములుగా ప్రబోధిస్తూ వస్తున్నాయి.

sri sathyasai vachanamrutam

**తనువు నిత్యము కాదు సంసారమది భ్రాంతి**
**అని దేహమును వీడి చనెడివారు.**

మనకంటి ఎదుట ఎంతమంది మరణిస్తున్నారు. ఎంతమంది జన్మిస్తున్నారు. ఎంతమంది మనలను వదలి వెడుతున్నారు. ఇది మనము గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. ఎన్ని చూసినప్పటికిని, ఎన్ని విన్నప్పటికిని, ఎన్ని అనుభవించినప్పటికిని ఇంకనూ మానవుడు ఈ శరీర భ్రాంతిని వదలుకోవటం లేదు. కనుక దేహతత్త్వాన్ని క్రమక్రమేణా కొంత తగ్గించుకోవటం అత్యవసరము. నాది నేనను భ్రాంతి అనర్థమంచు' ఏదిమనది. ఏది మన భూమి. ఏది మన వస్తువు. ఏది మన తత్త్వము. దీనిని మనము విచారించుకోకుండా కేవలము అన్ని నాది నేను అని స్వార్థ స్వప్రయోజన నిమిత్తమై మనము కాలమును కాయమును అనేక విధములుగా విస్మరింపచేస్తున్నాము. ప్రకృతియొక్క తత్త్వమే మనకు చక్కగా ప్రబోధిస్తూ వస్తున్నది. గడచిన వసంతకాలము తిరిగి వస్తున్నవి. అనేక ఋతువులు తిరిగి లభిస్తూ ఉన్నాయి. క్షీణించిన చంద్రుడు కూడను ప్రకాశిస్తున్నాడు. కాని నదీ జలము, నరుని యవ్వనము వెనుకకు రాదని జగత్తే మనకు ప్రబోధిస్తున్నది.

**ప్రకృతియే పరమ గురువు**

గురువు. ఎవరు మనకు నిజమైన గురువు? ఈ విధమైన అంతర ప్రబోధము గావించే దివ్యమైన ప్రకృతి మనకు నిజమైన గురువు కాదా! ఈ విశ్వమే మనకు గురువు. విశ్వమే కార్యము. విష్ణువే కారణము. కార్యాకారణ సంబంధ స్వరూపమైనదే విశ్వము

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పనిలేదా**
**హరిమయము కాని ద్రవ్యము**
**పరమాణువు లేదు ఇలను పరికించినచో**

ప్రపంచమంతయు భగవంతుని లీలా మానుష విశేషమే.

కనుకనే ఈశావాస్యమిదం జగత్ అంతయు భగవత్ స్వరూపమే. ఈ జగత్తు భగవంతుడు నివసించటానికి తగిన వసతి గృహము. ఆది లేని అనంతము. అన్నింటికి ఇదియే ఆది.

sri satyasai vachanamrutam

పెరిగినంతవరకు పెరిగి, వికసించినంత వరకు వికసించి తాను పూర్ణప్రకాశమును నొందుచున్నది. కనులకు కనుపించి, చెవులకు వినిపించి తనువును కరిగించి మనస్సును మరపించి మానవత్వము వికసింపచేసేది ఈ జగత్తు. ఇట్టి పవిత్రమైన జగత్తుకు త్రిగుణములే ఆధారము. త్రిగుణముల వికారమే ప్రకృతి. సృష్టిస్థితి లయములకు మూలకారణము. ఏతావాతా గుణములే ప్రకృతికి ప్రాణములు. గుణములయొక్క కార్యకలాప సముదాయమే ఈ ప్రపంచము. త్రిగుణములయొక్క తత్త్వమే త్రిమూర్తి స్వరూపము. త్రిగుణములయొక్క స్వరూప స్వభావములకు విశేష వికారములతో ఈ జగత్తు పాలింపబడుతూ ఉంటున్నది. ఏతావాతా ప్రకృతియొక్క స్వరూపము పరమాత్మ యొక్క స్వరూపమే. ఇట్టి భగవత్ స్వరూపమైన ప్రకృతిని మనము విస్మరించి, ఏదో చిల్లర మల్లర గురువుల నిమిత్తమై మనము ప్రాకులాడుతున్నాము.

దీనిని పురస్కరించుకొనియే

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః**

అన్నారు. ఎవరీ గురువు? గురుర్బ్రహ్మ. ఈ బ్రహ్మ ఎవరు? ఈ సృష్టి అంతయు బ్రహ్మ స్వరూపమే. ఈ సృష్టికి కారణము పరబ్రహ్మమే. కనుక సృష్టి స్థితి లయములకు ఆధారుడైన దివ్యత్వమే పరబ్రహ్మ. బృహత్ స్వరూపమైన ఈ ప్రకృతి తత్త్వమునకు పేరు బ్రహ్మ. ఇతడు అనంతుడు. ఇదియే పురుషసూక్తమునందు అత్యతిష్ఠ దశాంగుళమ్. భగవంతునిఎంత చూచినప్పటికిని ఇంకా పది యించిలు ఎక్కువగానే కనుపిస్తూ ఉంటాడుట. శృతియేమని చెప్పుచున్నది? సత్యం జ్ఞాన మనంతంబ్రహ్మ అంటుండాది. సత్యము పరమాత్మ స్వరూపము. ప్రేమ పరమాత్మ స్వరూపము. శాంతి పరమాత్మ స్వరూపము. ఈ సత్యశాంతి ప్రేమ స్వరూపమైన మానవుడు కూడను పరమాత్మ స్వరూపమే. కనుక గురుర్బ్రహ్మ అంటే భగవత్ స్వరూపుడైనవాడు కాదు. ప్రకృతి స్వరూపుడే బ్రహ్మ. అనగా ప్రకృతియే మనకు ప్రథమ గురువు.

గురుర్విష్ణుః, ఈ విష్ణువు ఎవరు? వ్యాపకశక్తి కలిగిన వాడే విష్ణువు. ఈ వ్యాపకత్వముచేత అనేక యుగములుగా ఈ ప్రకృతిలో ప్రవేశించినవాడు విష్ణువు. దీనినే తైత్తరీయ ఉపనిషత్తునందు ప్రకృతికి పోల్చుకుంటూ వచ్చారు. అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః లోపల

sri sathyasai vahini amrutam

వెలుపల సర్వత్ర ఉండినవాడు ఈ విష్ణువు అని. కనుక ఇది కూడను ప్రకృతి స్వరూపమే. సర్వత్ర వ్యాపించినవాడు విష్ణు స్వరూపుడు. ఇక్కడ బ్రహ్మకు విష్ణువుకు భేదము లేదు. కేవలము నామములు మాత్రమే వేరుగా ఉంటున్నవిగాని స్వరూప స్వభావములు రెండు ఒక్కటియే.

గురుదేవో మహేశ్వరః. ఈ ఈశ్వరుడు ఎవరు? అతను సకలైశ్వర్య స్వరూపుడే. ఈశావాస్యమిదం జగత్ జగత్తంతా నివసించినవాడు ఈశ్వరుడే. ఇతనియొక్క ఐశ్వర్యములే పంచభూతములు. ఆకాశము, గాలి, నిప్పు, నీరు, పృథ్వి ఈ పంచ భూత స్వరూపుడే ఈశ్వరుడు. ఇతను సకలైశ్వర్య స్వరూపుడు. కనుక ఏ ప్రదేశమునకు వెళ్ళినప్పటికిని ఈ పంచభూతములను విసర్జించి మనము ప్రాణములుంచు కోలేము. కనుక ఏతావాతా ప్రకృతి స్వరూపుడే ఈశ్వరుడు. సత్వరజో తమోగుణములతో కూడియుండిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ప్రకృతియొక్క ఆకార స్వరూపులే.

## సత్యంవద ధర్మంచర

మానవునకు ఉదాత్తత ఉదారత ప్రధానమైన జీవనాళములు. సత్యంవద ధర్మంచర. అనే ప్రధాన శాసనములు ప్రతి మానవునికి ప్రాణ సమానము. మానవుడనగా కేవలము శరీర ఇంద్రియ మనో బుద్ధులయొక్క స్వరూపుడు. అన్నింటికిని సాక్షీభూతుడైన ఆనందస్వరూపుడే మానవుడు. అతనే సత్ చిత్ ఆనందము. ప్రతీ మానవుడు సచ్చిదానంద స్వరూపుడే. ఐతే ఇట్టి సచ్చిదానందతత్త్వాన్ని మానవుడెందుకు గుర్తించుకోటం లేదు. ఈ శరీరముపైనున్న మమకారం చేత, అభిమానం చేత మానవుడు తన మనస్సును బహిర్ముఖముగా మార్చుకుంటూ అభివృద్ధిగావించుకుంటూ వచ్చాడు. తద్వారా ఈ యొక్క ప్రభావమునకు లొంగి స్వభావాన్ని మర్చిపోతూ వచ్చారు. ఈనాటి మానవులందరు కేవలం ప్రకృతి ప్రభావాలకు మాత్రమే లొంగుతున్నారు కాని ఆత్మసంబంధమైన స్వభావాన్ని గుర్తించటానికి ఏమాత్రం ప్రయత్నించటం లేదు. ఇట్టి మానవత్వము ఈనాడు అద్వైతము అనగా రెండు కానటువంటి ఏకత్వాన్ని మనము అనుభవించాలి. అనగా సమన్వయము అంటాము. ఈ సమన్వయ మనగా యేమిటి? ఒకరితో ఒకరు కూడటం ఒకరితో ఒకరు చేరటం ఇది సమన్వయమని భావిస్తున్నాము. ఇది నిజమైన సమన్వయము కాదు. సమరసము కూడా కాదు. అనేకత్వములో ఉన్న ఏకత్వమే సమన్వయము.

sri sathyasai vachanamrutam

అనేకత్వములో మనం ఏకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇక్కడే భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థ అద్వైతము. ఈ మూడింటిని మనము గుర్తించినప్పుడే ఈ దివ్యత్వమనేది మనకు అర్థమవుతుంది.

భావాద్వైతము. ఇది ఒక వస్త్రము. దారము లేక వస్త్రము కాలేదు. పత్తి లేకదారము కాలేదు. పత్తి దారము వస్త్రము మూడు ఒక్కటే. దీనికి పత్తి అనేది ఉపాదాన కారణము. మగ్గము నేసేవాడు నిమిత్తకారణము. ఇది ఒక వెండి టంబ్లరు. అయితే దీనికి ఉపాదానకారణం వెండి. దీనిని ఏర్పరచిన కంసాలి నిమిత్తకారణం. అయితే ఉపాదానకారణం లేక నిమిత్తకారణం దీనికి సరియైన రూపము చేర్చుకోలేదు. కనుక భావాద్వైతమనగా అన్నింటియందు ఉండిన ఏకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. పత్తి, దారము, వస్త్రము మూడు ఒక్కటే. ఇదే భావాద్వైతము.

క్రియాద్వైత మనగా ఏమిటి? మనము ఎన్నిరకములైన కర్మలు ఆచరించినప్పటికిని నేను చేస్తున్నాను నేను అనుభవించాను, నేను సాధించాను అనే ఈ కర్తృత్వం భోక్తృత్వం చేతనే మానవుడు భిన్నత్వమును పొందుతున్నాడు. ఏకార్యము చేసినప్పటికి ఏమి సాధించినప్పటికిని, ఎన్ని అనుభవించినప్పటికి ఇవన్నీ భగవత్ప్రీత్యర్థమంటే అదే కర్మాద్వైతము. కనుకనే భావములు భగవంతునిపై ఉంచి కర్మలెన్ని ఆచరించినా ఇది అద్వైత రూపకంగా గోచరిస్తుంది.

ఇంక పదార్థ అద్వైతము. ఈ పదార్థ అద్వైత మనేది ఈనాటి మానవునికి చాలా ప్రధానమైనది. ప్రతివ్యక్తి, ప్రతిప్రాణి కూడను పంచభూతములతో కూడిన వాడే. ఒక్కొక్క వ్యక్తియందు శబ్దము ఆకాశస్వరూపము. గాలి మన ఉచ్ఛ్వాస నిశ్వాస స్వరూపము. వేడిమనయొక్క temperature. మన చెమట మూత్రము ఇవన్నీ జలస్వరూపము. మన దేహమంతా మృణ్మయ స్వరూపమే. ఈ పంచభూతములు పరమాత్మ స్వరూపము కదా! కనుక ప్రతిమానవుడు ఈ పంచభూతములతో కూడినటువంటి వాడే కనుక అందరు కూడను ఒక్కటే. ఈ దేహము నందేది ఉన్నదో మీ దేహమునందు కూడను అదే ఉన్నది. మీ దేహమునందు ఏమి ఉన్నదో ఈ దేహమునందు అదే ఉన్నది. ఈ రూపనామములు వేరుగాని పదార్థములు ఒక్కటే. ఇట్టి

srisathyasaivachanamrutam

పదార్థ అద్వైతాన్ని గుర్తించటానికి మనం ప్రయత్నించినప్పుడు ఏకోవసి సర్వభూతాంతరాత్మ అందరియందు ఉన్న దివ్యత్వం ఒక్కటే అనే సత్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. కనుక జగత్తంతా కేవలం అద్వైతమయమైనదే. ఏకమేవ అద్వితీయంబ్రహ్మ. రెండవది లేనేలేదు. అట్టి తత్త్వాన్ని మనం పొందవలెనన్న మన ప్రాచీన ఋషుల ప్రబోధలు మనం చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. కాని దురదృష్టవశాత్తు ఈ ఉపనిషత్తులకు కాని ఈ బ్రహ్మ సూత్రములకుగాని, ఈ వేదములకుగాని సరైన అర్థము చెప్పే వ్యక్తులు లేకపోవటంచేత అనర్థాలలో పడి నానార్థములు పెంచుకొని యదార్థమును మరచిపోతున్నారు. ఎవరికి తోచినట్లు వారు సమన్వయము గావించుకుంటూ వస్తున్నారు.

## ప్రేమతో జీవితం గడపండి

ప్రేమస్వరూపులారా! సర్వులుకూడను ప్రేమమయమైన తత్త్వాన్ని మనం అనుభవించి అందించాలి. ఈనాడు ప్రబోధించే వ్యక్తులు ఇతరులకు ప్రబోధించే విషయాలు తమకు కూడా అన్వయిస్తాయనే సత్యాన్ని మరచిపోతున్నారు. కేవలం ప్రేక్షకులకు మాత్రమే మనం ప్రబోధిస్తున్నామని భావిస్తున్నారు. కనుక వారియొక్క ప్రబోధలకు విలువ లేకుండా పోతున్నాది. ప్రబోధించే వ్యక్తి తాను ఆచరించి, అనుభవించి, ఆనందించి, పెంచి పదిమందితో పంచుకోటానికి ప్రయత్నించాలి. ఈనాడు పవిత్ర భారతదేశములో నాస్తికత్వము అభివృద్ధికావటానికి ఇదే మూలకారణము. చెప్పే వ్యక్తులు చేయటానికి పూనుకోవటం లేదు. కనుక త్రికరణ శుద్ధియే నిజమైన మానవతా విలువ. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అనే పదములు కాదు. సంకల్పించుకున్న దానిని వాక్కులో ఉచ్చరించటం, సంకల్పవాక్కులు రెండింటిని క్రియారూపంలో పెట్టటము. ఇట్టి త్రికరణ శుద్ధియే మానవత్వము. కాని ఈనాడు ఈ త్రికరణశుద్ధి ఏమాత్రం మనయందు కన్పించటం లేదు. మనసుయందు వేరు మాటయందు వేరు, క్రియ మరొకటిగా రూపొందుతూ ఉంటున్నాయి. కనుకనే పవిత్రమైన దివ్యత్వమును మనం పొందవలెనన్న ఏకత్వాన్ని మనం సాధ్యమైనంత వరకు అర్థం చేసుకోటానికి ప్రయత్నించాలి.

ప్రపంచమంతయు పరిపూర్ణమైన స్వరూపమే. దీనికి భిన్నత్వమనేది ఏమాత్రం కన్పించదు.

srisathyasai vachanamrutam

పరిపూర్ణమైన బ్రహ్మము నుండి పరిపూర్ణమైన జీవత్వము ఉదయించింది. పరిపూర్ణమైన జీవతత్త్వమునుండి దేహము విడిపోగా పరిపూర్ణ మైనదిగానే శేషిస్తోంది.

**అదియు పూర్ణము యిదియు పూర్ణము**
**పూర్ణమున ఉదయించు పూర్ణము**
**పూర్ణమున పూర్ణము తీసిన**
**పూర్ణమే శేషించియుండు**

పూర్ణమునుండి పూర్ణము పోతే మిగిలినది కూడా పూర్ణమే.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అంతా పూర్ణమే. శేషించినటువంటిది పూర్ణమే. అనుభవించినటువంటిదీ పూర్ణమే. గతించినటువంటిది పూర్ణమే. వర్తమానము పూర్ణమే దేహభ్రాంతి చేతనే మనం ఈ పూర్ణత్వాన్ని విస్మరిస్తున్నాము.

**భగవంతుడు రస స్వరూపుడు**

ఇంద్రియముల చేతను దేహము చేతను అనేక కర్మలు మనము ఆచరించవచ్చును. ఇది కేవలము దేహవృత్తులు తప్ప ఆత్మకు సంబంధము లేదు. ఆత్మ అనగా ఇదియే దీనికి సరైన ప్రమాణము. ప్రజ్ఞానమే ఆత్మ. ఈ ప్రజ్ఞానము దేహమునందు ఇంద్రియములయందు అంతః కరణములయందు వాక్కునందు సర్వత్ర నిండిఉంది. ఇది ఒకదానికొకటి అన్యోన్య ఆశ్రయములై అవినాభావ సంబంధములై ఉంటున్నవి. కన్ను చూస్తున్నదని మీరు భావిస్తున్నారు. కాదు కాదు. కన్ను కేవలము ఒక పనిముట్టు వంటిది. ఈ అంతఃకరణ ప్రజ్ఞావృత్తి ద్వారానే ఎరుపు, నలుపు తెలుపు అని రంగులు చూడగలుగుతున్నది. ఈ రంగులు చూస్తున్నది కన్నులు కాదు ప్రజ్ఞయే. ఇంక చెవులు వినిపిస్తున్నాయి. శబ్దములు వింటున్నామంటున్నారు. కాదు కాదు. అంతఃకరణ, వృత్తి ద్వారా ఈ ప్రజ్ఞ ప్రవేశించి ఈ చెవులు మంచి చెడ్డ శబ్దములు వినగలుగుతున్నాయి. కనుక అన్నింటికి ప్రజ్ఞయే ప్రధానమైనది. ఇక్కడ వాక్, మనస్సు, ప్రాణము ఈ మూడింటి యొక్క చేరికయే ఆత్మ. వాక్కు తేజోమయము. మనస్సు అన్నమయము, ప్రాణము



sri satyasai vachanamrutam

రసమయము. వాఙ్మయమైన ఈ తేజస్సు మనోమయమును ఒక ప్రాణమయముగా మార్చుకోటానికి ఇదే మూలకారణము. ఈ అన్నమయమైన మనస్సును రసమయముగా మారుస్తుండేది కూడను యీ వాక్కు. దీనినే ఉపనిషత్తులు రసోవైసః అన్నారు.

ఈ రసస్వరూపుడే పరమాత్ముడు. ఇంతేకాదు. అంగీరసః అన్నారు. మన అంగముల లోపల సర్వత్ర ఉండి ఒక్కొక్క అంగమునందు రసస్వరూపుడైనదే ఆత్మ. కనుక ఇట్టి భగవత్ తత్త్వాన్ని మనం గుర్తించటానికి ఎన్నో విధముల సాధనలు చేయనక్కరలేదు. ప్రాకృతమైన జీవితమునందు నిత్యప్రపంచమునందు అనుభవించే ప్రతి విషయాన్ని మనం చక్కగా విచారణ చేస్తే ఈ ఆత్మతత్త్వం సులభతరమవుతుంది.

హేతువు అని భగవంతునకు ఒక పేరు. హేతు అనగా ఏమిటి? సృష్టి అంతాకూడను ఉపాదాన కారణము నిమిత్త కారణము తానే. ఈ రెండింటికిని కారణభూతుడు కావటంచేతనే ఇతనిని హేతువు అన్నారు. ఇతనికి విచ్ఛరుడు అని మరొకపేరు. అనగా జగత్తునందు ఉద్భవించిన ప్రతి పదార్థముకూడాను క్షీణిస్తుంది. మార్పు చెందుతుంది. ఎన్ని క్షీణించినా, ఎన్ని మార్పులు చెందినా భగవంతునియందు క్షీణత తెలియదు. మార్పు కలుగదు. ఇంతేకాదు. భగవంతునియొక్క ప్రేమ తత్త్వము అఖండమైనదిగా ఉంటుంది. అది తరిగేదికాని పెరిగేదికాని కాదు.

**క్షణము లోపలె పుట్టుచు క్షణములోనె**
**పెరుగునట్టిది ఎప్పుడు ప్రేమకాదు.**
**చావు పుట్టుక లేనట్టి జీవి హృదిని**
**నిత్యనిర్మల జ్యోతియై నెగడు ప్రేమ.**

ఈనాటి మన ప్రేమలన్నియు క్షణంలో పుడుతున్నాయి. క్షణములో మరణిస్తున్నాయి. కాని భగవంతుని ప్రేమ అట్టిదికాదు. దానికి పుట్టుక లేదు. చావు లేదు. ప్రేమయే అతనియొక్క స్వరూపము. ప్రేమయే అతని స్వభావము. దానికి ఒరిగేది కాని, తరిగేది కాని పెరిగేది కాని లేదు. ఈ చావు పుట్టుకలు రెండు ఉన్న దేహియొక్క హృదయమునందు నిత్యనిర్మల జ్యోతియై నెగడు అదియే ప్రేమతత్త్వము. అఖండమైన ప్రేమ అన్యులకంతా అందించే స్వభావమే భగవంతునిది. కనుకనే ఓం విచ్ఛరాయనమః అని పిలుస్తూ వచ్చారు. అనగా భగవంతునిప్రేమ

sri sathyasai vachanamrutam

ఏవిధమైన వారికైనా సమంగా అందిస్తూనే పోతుంది.

కొంతమంది భావించవచ్చు. కొంతకాలం భగవంతుని ప్రేమ అనుభవించాము. మరికొంతకాలము భగవంతుని ప్రేమకు దూరమయ్యామని భావిస్తూ ఉంటారు. ఇదంతా వారి భావ భావభేదములు తప్ప భగవంతుని భేదములు కావు. ప్రకృతి అంతయు కూడా ఒక శుద్ధమైన అద్దము వంటిది. ఆ అద్దము ముందు ఏవిధమైన చర్యలు చేస్తావో దాని ప్రతిబింబాన్నే నీవు అనుభవిస్తావు. కనుక నీవు చేసిన మంచి చెడ్డలే నీకు ఆవిధంగా ప్రేమకు సమీపంగా ప్రేమకు దూరంగా కన్పించినట్లుగా ఉంటుంది. భగవంతుని యొక్క ప్రేమతత్త్వము ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటుంది. ఆ ప్రేమ నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్యశుద్ధ బుద్ధముక్త నిర్మలస్వరూపిణం. ఈనాటి ప్రేమలన్నియు కూడను దేహమును ఆధారము చేసుకొని ప్రేమను పెంచుకోవటం త్రెంచుకోవటం జరుగుచున్నది.

**అందరూ ఆనంద స్వరూపులే**

ప్రేమస్వరూపులారా! దుఃఖముగానే ఆనందముగాని మానవునికి స్వభావములు కావు. ఇవి కేవలము కల్పితములు మాత్రమే. దుఃఖమే కనుక స్వభావము అయితే ఈ దుఃఖమును నిర్మూలంగావించటం ఏమాత్రం సాధ్యంకాదు. ఎన్ని తపస్సులు చెయ్యి. ఎన్ని పూజలు చేయి ఈ దుఃఖ నివారణ కావటానికి వీలుకాదు. కారణము ఏమిటి? స్వభావాన్ని మార్చటానికి ఎవరికి వీలులేదు. బెల్లమునకు తీపి స్వభావము. ఈ స్వభావము మార్చటానికి ఎంత మాత్రము వీలుకాదు. అదేవిధముగనే మనకు దుఃఖము స్వభావము కాదు. కనుకనే మనము మార్చుకోగలుగుతున్నాము. ఈ సుఖదుఃఖములు రెండు మనస్సుయొక్క వికారములే. ఈ మనోవికారములచేత సుఖదుఃఖములు రెండూ మనకు సంభవిస్తున్నాయి. నిజముగా మనము ఆనంద స్వరూపులమే. అనంత స్వరూపులమే. అమరులమే. ఇట్టి సత్యాన్ని మనం భావించాలి. ఎప్పుడిది మనకు భద్రపడుతుంది. భగవత్ప్రేమను మనం అనుభవించినప్పుడే ఇట్టి భద్రత ఏర్పడుతుంది. నాది నావారు అనే స్వార్థ స్వప్రయోజనములు మనం కొంతవరకు నిర్మూలన గావించుకోవాలి. ఎవరికో కొంత మందికి మాత్రమే మనం సేవ చెయ్యాలి కొంత మంది క్షేమాన్ని మాత్రమే మనం కోరాలి అనికాదు. అందరి క్షేమాన్ని కోరాలి. అందరి ఆనందాన్ని

sri sathyasai vahini amrutam

మనం ఆశించాలి. అందరి అభివృద్ధిని మనం అభిలషించాలి. ఇట్టి పవిత్రమైన భావంచేతనే ప్రాచీనులు లోకాస్సమస్తాఃసుఖినోభవంతు అనే ఈ పవిత్ర సూత్రము నందిస్తూ వచ్చారు. వేదము కూడా ఇట్టి సమత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది. సహనా వవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై ఇది ఏమిటి?

**కలసిమెలసి పెరుగుదాం కలసిమెలసి తిరుగుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలత లేక చెలిమితొ జీవించుదాం**
**కలసిమెలసి కలత లేక చెలిమితో జీవించుదాం**

అని అనింది వేదం. కానీ ఈనాడు మాదిమీది అనే భేదభావములకు చోటివ్వటం చేత కలతలు అభివృద్ధి అవుతున్నాయి.

ప్రేమస్వరూపులారా! ఈ దివ్యమైన భావములు మీ హృదయమునందు నింపుకోటానికి తగిన కృషి చేయండి. ద్వేషము, అసూయ ఇలాంటివి మన హృదయములో ఏమాత్రము ప్రవేశించరాదు. ఏనాడు ఈ దివ్యమైన ప్రేమను మనం అనుభవిస్తామో ఆనాడే మనము దివ్యత్వాన్ని కూడా అనుభవిస్తాము. ఒకానొక సమయంలో ధర్మజుడు కృష్ణుని ప్రశ్నించాడు. నిన్ను దూషించే దూషణలు నేను వినలేక పోయేవాడను. ఈ శిశుపాల దంతవక్త్రాదులు మహాపాపులు. దివ్యమూర్తులైన పరమాత్మను ఇన్ని విధములుగా నిందిస్తూ వచ్చారు. కాని అట్టివారు ఏనాటికైనా ఈ పాపఫలము అనుభవించక తప్పదని భావించాను. కానీ ఈ మహా సభలోపల నేను నాకన్నులతో చూస్తూ ఉండగనే వారి దివ్యమైన జీవన జ్యోతులు నీలో ఐక్యమైపోయాయి. ఇలాంటి పాపులకుకూడా నీలో ఐక్యత ఉంటుందా అని ప్రశ్నించాడు. ధర్మజునికి ఒకచక్కని పేరు మధురభాషణుడు, రాజభూషణా అని రెండవ టైటిల్. రాజభూషణా! మధుర భాషణా! ఇది కేవలము నీభ్రాంతి తప్ప అన్యంకాదు అన్నాడు కృష్ణుడు. దూషణ భూషణ తిరస్కార పురస్కారములు దేహమునకు మాత్రమేగాని ఆత్మకు లేవు. దేహమే నేను అనే మమకారం చేత నీవు ఈ బాధకు గురికావలసి వచ్చింది. ఈ దేహ భ్రాంతి చేతనే ఆత్మభ్రాంతి నీకు అడ్డుతగిలింది. కనుక ఈ దుఃఖమునకు కాని ఈ ఆనందమునకుగాని, ఈ

క్రోధమునకుగాని, ఈరాగమునకుగాని నీ మనసే కారణము. మనసు మంచిగా మరల్చుకో. అంతేగాని ఎట్టివారికైనా నాలో స్థానము ఉంటుంది.

ఎక్కడ నుండి వచ్చావో అక్కడికి తిరిగి పోకతప్పదు. మట్టినుండి పుట్టినటువంటి కుండ పగిలి ముక్కలైతిరిగి మట్టిలోనే చేరి పోతుంది. అదే రీతిగా ఈదేహము మృణ్మయమునుండి వచ్చింది. మృణ్మయములోనే తిరిగి దేహము చేరిపోతుంది. ఆత్మ చిన్మయ స్వరూపము. అది నిరంతరము చిన్మయంగానే ఉంటుంది. ఆత్మప్రేమ మయమైనది. జ్యోతిర్మయమైనది. అక్కడ బల్బుఉంది. కానీ వెలుతురు ఎక్కడి దాకా ప్రసరించింది. ఈ వెలుతురు కేమిరూపము? ఏరూపము లేదు. ప్రకాశమేదాని రూపము. అటులనే ఆత్మఅనేది ఒక ప్రకాశము. దానికిట్టిది అట్టిది అని రూపములు చెప్పటానికి వీలుకాదు. మనలో ఉన్న గుణములయొక్క మార్పుచేతనే దానియొక్క స్వరూపము నిరూపణ అవుతుంది.

**నాలుగు వర్ణములవారు నలుగురు సోదరులే**

దివ్యాత్మస్వరూపులారా! భగవత్తత్త్వమందు కాని భగవద్వాక్యమందు గాని ఎంతో విశాలమైన అనంతమైన అర్థములు కలిగిఉంటాయి. ఇక్కడ ఒక చిన్న ఉదాహరణము. వర్ణములంతా భగవంతుడు సృష్టించామని అనుకుంటాము. అయితే ఈ వర్ణములు సృష్టించటానికి కారణమేమిటని ప్రశ్నించుకుంటే గుణములు, కర్మలు బట్టి ఈ వర్ణములు మార్పుచెందుతూ వచ్చాయి. సూర్యునికి మూడు రంగులు ఉంటున్నాయి. ఒకటి నలుపు, రెండవది తెలుపు మూడవది ఎరుపు. ఈ తెలుపు, ఎరుపు, నలుపు. ఇవి నిత్యము మనము దర్శిస్తున్నాము. రాత్రి చీకటి అది నలుపు. తెల్లవారేటప్పటికి నలుపు పోయి ఎరుపు ప్రారంభమవుతుంది. సూర్యకిరణములు. ఈ ఎరుపురంగు మారి తెల్లటి తెలుపుగా మారుతోంది. ఈ ఎరుపు ఎక్కడనుండి వచ్చింది. నలుపునుంచి వచ్చింది. ఈ తెలుపు ఎక్కడినుండి వచ్చింది. ఎరుపునుండి వచ్చింది. కనుక నలుపునుండి ఎరుపు ఎరుపునుండి తెలుపుగా మారిపోయింది.

కనుక ప్రతి మానవుడూ పుట్టే సమయంలో సర్వులూకూడను అజ్ఞానంగా ఉంటారు. నలుపుగా ఈ అజ్ఞానమును క్రమక్రమంగా మార్చుకుంటూ వస్తే రజోగుణంగా మారిపోయింది. ఈ రజోగుణమే సాత్వికంగా రూపొందుతుంది. కనుక ఉద్రేకం కలిగినవాడు, రాగద్వేషము

sri sathyasai vachanamrutam

కల్గినటువంటివాడు ఎరుపు. అదే క్షత్రియుడు అన్నారు. పవిత్రమైన, దివ్యమైన భావములు కల్గినటువంటివాడే బ్రాహ్మణుడు అన్నారు. మూర్ఖత్వంచేత అజ్ఞానంచేత కుమిలిపోయినవాడు శూద్రుడు అన్నారు. కనుక అందరూ మూర్ఖులు కాదు. అందరూ వీరులు కారు. అందరూ సాత్వికులు కారు. అందరియందలి గుణకర్మలు ఆధారం చేసుకొనియే వీరిని ఈవిధంగా వర్ణములుగా విభజించారు. అందరూ భగవత్ స్వరూపులే.

ప్రతిఒక్క వ్యక్తి భగవత్ ఆకారులే. ఒక తల్లికి నలుగురు కొడుకులుంటారు. పెద్దకుమారుడు చక్కగా వేదాధ్యయనం చేసి చదువునంతా అభివృద్ధి గావించుకొని ఉన్నతస్థాయిలో పండితుడని అనిపించుకుంటాడు. రెండువాడు యుద్ధములో చేరి గొప్పయుద్ధ వీరుడుగా రూపొందుతాడు. అతనిని సిపాయి అంటారు. మూడవాడు వ్యాపారములో ప్రవేశించి గొప్ప వ్యాపారిగా పేరు పొందుతాడు. నాల్గవవాడు తండ్రికి ఉన్న భూమిని ఎందుకు వృథా చెయ్యాలని దానిని సాగుచేసి పంటలు పండిస్తూ సేద్యవానిగా రూపొందుతాడు. నాల్గవవాడు కర్షకుడు. మూడవవాడు వ్యాపారి, రెండవవాడు క్షత్రియుడుగా యుద్ధవీరుడుగా ఉన్నాడు. మొదటి వాడు గొప్ప పండితునిగా ఉన్నాడు. అతను పండితుడు ఇతను క్షత్రియుడు ఇతను వ్యాపారి ఇతను శూద్రుడు ఈ నలుగురూ ఒక తల్లి బిడ్డలు కారా! వారి వృత్తులను బట్టి ఈ విధమైన పేర్లువచ్చాయి. కాని నిజంగా చూస్తే సర్వులు కూడా ఒక తల్లి బిడ్డలే. కనుక ఈ భేదములను మనం ఏమాత్రం పాటించరాదు. చెట్లకంటే హీనమైపోతున్నాము మనమీనాడుఏ. ప్రతి ఒక్కరి హృదయమందు భగవన్నామము సమంగా ఉచ్చరించాలి.

**సాయినామమె హాయి స్మరియించుడో యంచు**
**వృక్షముల్ తలలూపి పల్కుచుండు**
**సాయినామమె హాయి స్మరియించుడోయంచు**
**పక్షి సంతానముల్ పల్కుచుండు**
**సాయినామమె హాయి స్మరియించుడోయంచు**
**కుసుమముల్ వాసనల్ కురియుచుండు**
**సాయినామమె హాయి స్మరియించుడోయంచు**

srisathyasaivacharamrutam

**తుమ్మెదల్ ఝుమ్మని యరచుచుండు**
**ఆకాశమునుండి యిదియె శబ్దంబు వచ్చు**
**భూమినుండియు యిదియె శబ్దంబు వచ్చు**
**సాయిసాయి యనుచు సర్వదిక్కులనిండి**
**పిక్కటిల్లుచునుండు పర్తియందు.**

ఎక్కడ చూచినా ఒకరికొకరు సాయిరాం సాయిరాం అంటారు. ఈ హృదయము ఎంత పవిత్రముగా రూపొందుతుంది. సాయి అంటే ఒకరిపేరుకాదు. హృదయముపై పవళించే పరమాత్మ తత్త్వమేసాయి.

ఈనాడు మనయొక్క సంస్కృతిని పవిత్రభావాలను పూర్తిగా మరచిపోతున్నాము.

**మంచి తత్త్వంబు మరచిరి మనుషులంత**
**ధర్మమడుగంటె సంఘాన కర్మకాలి**
**నిలువనీడయె లేకుండెనీతికెచట**
**ఇంతకంటెను దౌర్భాగ్యమేమికలదు.**

నీతికేమైనా చోటు నిస్తున్నామా? లేదులేదు. నీతే మన జాతి.

**జాతిగౌరవంబు నీతిపై నిలుచును**
**నీతి లేకయున్న జాతి చెడును**
**నీతికలుగు జాతి నిజమైన జాతిరా**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

**సంఘ సంస్కారమంతయు గంగకలసె**
**మనుజ జాతికి తృప్తియే మాయమయ్యె**
**శీలనీతులు జగతిలో క్షీణమయ్యె**
**ఇదియె ప్రోగ్రెస్సు యీనాటి విద్యయందు**

ఇలా మనం చేయవలసింది. మన ప్రోగ్రెస్సు ఏమిటి? కన్న తల్లితండ్రులను మనము ధిక్కరిస్తున్నాము. వారిని గౌరవించలేని దురవస్థలకు గురైపోతున్నాము.

srisathyasaivachanamrutam

## కృతజ్ఞతతో ఉండండి

ప్రేమస్వరూపులారా! మనల్ని కడుపులోపెట్టుకొని అనుకూలవంతులై అన్నివిధముల మనలనాదరించి అభివృద్ధిగావించిన తల్లిదండ్రులనీనాడు విస్మరిస్తున్నప్పుడు ఏ యొక్క అనుకూలములు లేక మనకు అతీతమై అగమ్యగోచరమైన దైవత్వాన్ని మీరు ఏరీతిగా ప్రేమించగలరు? నీ అనుకూలములో ఉన్న దానిని నీవు ప్రేమించలేనప్పుడు అవ్యక్తమై అగోచరమైన దైవత్వాన్ని నీవు ఏరీతిగా ప్రేమించగలవు. కనుక మొట్టమొదట నీతల్లిదండ్రులను నీవు ప్రేమించు వారే నిన్ను పెంచి పెద్దచేసి ఈ స్థితికి తీసుకువచ్చారు. ఇట్టివారికి కృతజ్ఞత చెప్పలేని మానవుడు దైవభక్తి దైవభక్తి ఈ భక్తి నిజమవుతుందా? ఇది కానే కాదు. కేవలం దైవాన్ని కూడను స్టంట్ చేయటం. మొట్టమొదట నీకందుబాటులో ఉండి, నీ అధీనములో ఉండి, నిన్ను ప్రేమించి, నిన్ను అభివృద్ధి గావించి, నిన్నింతవరకు తెచ్చిన తల్లిదండ్రులను నీవు మొట్టమొదట ప్రేమించు. అదే మాతృదేవోభవ పితృదేవోభవ. ప్రత్యక్ష స్వరూపమును మనము విస్మరిస్తున్నాము. పరోక్షమైన దేవతలనంతా ఆరాధిస్తున్నాము. సజీవులను బాధించటము నిర్జీవులను పూజించటము, ఇది భక్తికానేరదు. సజీవులను పూజించు. ప్రతి మానవునియందు దైవత్వమును విశ్వసించు. ఇదియే సాయి ప్రబోధ. నిజముగా ఈ సమత్వాన్ని మీరు అభివృద్ధి పరచుకుంటే భారతదేశము యొక్క సంస్కృతి ఇంతకంటె వేరేమి లేదు. ఎవరినీ మనం ద్వేషించరాదు.

వ్యాసుడు గొప్పమహర్షి. వ్యాసోనారాయణో హరిః అన్నారు. అతను నారాయణ స్వరూపుడని ఒక ప్రఖ్యాతి. అతను శబ్ద స్వరూపములో ఉండే వేదాలనంతా అక్షర స్వరూపంలోనికి మార్చాడు. ఇతను అరుంధతియొక్క ముని మనుమడు. ఇలాంటి మహర్షి ఈవిధమైన అనంతమైన వేదాలను అనేక రూపములలో ఉన్న వేదాలను మానవుడు అనుభవించటానికి సాధ్యంకాదని గుర్తించి దానిని విభజించుకుంటూ వచ్చాడు. ఆషాఢ పౌర్ణమినాడు పుట్టినదినము. కనుక ఈనాడు వ్యాసపౌర్ణమి అనటానికి అదేమూలకారణము. మానవత్వంలో ఉన్న దివ్యత్వాన్ని సమత్వంగా భావించి ప్రపంచానికి వ్యాపింపచేసినవాడు వ్యాసుడు. 18 పురాణములు వ్రాసి ఈ 18 పురాణములు పఠించటము సాధ్యము కాదని గుర్తించి పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం. అని రెండు వాక్యములలో దానియొక్క సారాంశాన్ని ముగించాడు. Help ever,

sri sathyasai vahini.org

Hurt never. అందరికి సహాయం చేయి. ఎవరినీ నీవు బాధించవద్దు. ఈ పవిత్రమైన సూక్తులనంతా లోకానికి అందించినవ్యక్తి వేదవ్యాసుడు. వ్యాసుడు పుట్టిన దినము పౌర్ణమి. కనుక ఇది గురుపౌర్ణమి. లోకానికంతా ఒక గుర్తును తెప్పించినవాడు కనుక అతనిని గురువు అన్నారు.

గురువు అనగా అంధకారము నిర్మూలంగావించేవాడు. కనుక నిజమైన గురువు భగవంతుడే. ఈ అంధకారమనే అజ్ఞానము నిర్మూలించే శక్తి సామర్థ్యములు అతనికి మాత్రమే ఉంటున్నాయి. మిగిలినవి లోక సంబంధమైన విషయాలు బోధించేవారు ఉపాధ్యాయులు కావచ్చు. వీరంతా ఎవరికీ గురువులు కానేకారు. ఉపదేశం చేసేవారంతా గురువులుకారు. గురోగురుః వారందరికి గురువైనవాడు భగవంతుడు. కనుక ప్రతిఒక వ్యక్తి భగవంతుని గురువుగా భావించాలి. ఈ గురుపూర్ణిమ అని చెప్పి గురువులకు పూజలు చేయటం పళ్ళు దక్షిణలు ఇవ్వటం ఇదికాదు గురుపూజ. ఈనాటి గురువులంతా చెవిలో మంత్రము చేతిలో డబ్బు, వీరు బాధగురువులు, బోధగురువులే గాని నిజమైన గురువు భగవంతుడొక్కడే. కనుకనే గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః. భగవంతుడే గురువు అన్నారు. ఆ భగవంతుడెవరు? ప్రకృతే మనకు భగవత్ స్వరూపము. Nature is the best teacher. ఈ జగత్తే మనకు నిజమైన గురువు. ఈ విశ్వములో ప్రతిపక్షి, ప్రతి వృక్షము, ప్రతిశిల అన్నీ కూడా మనకు అనేక రకములైన ఉపదేశములు గావిస్తున్నాయి. అడవులంతాకూడను కేవలము కాష్ఠమయము. కొండలంతా కేవలము శిలామయము. భూమి అంతా కేవలము మృణ్మయము. దేహమంతా కేవలము మాంసమయము. ఇవన్నీ పంచభూతముల మయమే. దీనికంటె భిన్నమైనది మనకు ఎక్కడా కనుపించదు. కనుక విశ్వమే మనప్రధానమైన గురువు. ఈ విశ్వముయొక్క దివ్యత్వమును చక్కగా మనము అనుసరించాలి.

చూడండి మనము ఒకదినము ముందుగా నిద్రపోవచ్చును. ఒకదినము ముందుగా నిద్రలేవచ్చును. కానీ ప్రకృతి శాసనముననుసరించి ఋతువులు ఎంత కరక్ట్‌గా చక్కగా వస్తున్నాయి. ఈ సూర్యోదయ సూర్యాస్తమయములు ఎంత చక్కగా నడుస్తున్నాయి. జగత్తులోపల ప్రతి ఒక్కటి కూడను తమ తమ నియమాల్ని పాటిస్తూ ఉన్నాయి. మానవుడు ఒక్కడే తన

sri sathyasai vachanamrutam

నియమాన్ని ఉల్లంఘించి పోతుందేది. కనుక ఈనాడు మానవునికే సర్వధర్మములు అత్యవసరమైనవి. పశువులు తమ తమ ధర్మములను తాము పాటిస్తున్నాము. మృగములు తమతమ నియమాలు తాము పాటిస్తున్నాయి. వాటికి కూడా కొంత season and reason ఉన్నాయి. ఏ reason ఏ season లేకుండా పరితపించేవాడు మానవుడే. అట్టి మానవునికే ఈనాడు సుబోధలు అత్యవసరము. అట్టి మానవునికే ఈనాడు ధర్మప్రబోధలు అత్యవసరం. అట్టి మానవునికే నీతి నిజాయితీలు అత్యవసరం. వీటన్నింటికిని ఒక నియమాన్ని పాటించాలి. ఆ నియమమే ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికము లేకపోతే మానవుడు ఏమాత్రం ప్రకాశించడు వికసించడు.

**ఎవరి కర్తవ్యమును వారు ఆచరించండి**

ప్రేమ స్వరూపులారా! మనము ప్రేమను పొందాలనుకుంటే, ఎనిమిదవ తరగతి పిల్లవాడు చెప్పాడు. నామస్మరణ, నామస్మరణే తరుణోపాయం. ముఖ్యముగా మీరు సేవాకార్యక్రమములలో పాల్గొని నామస్మరణ చేత సేవను ఆచరించాలి. ఈనాడు ప్రత్యేకమైన విషయాన్ని మీరు గుర్తించుకోవాలి. మానవదేహము కర్మనిమిత్తమై లభించింది. కర్మాను బందీని మనుష్యలోకే. కార్యకలాప సముదాయాలన్నీ కూడను ఈ కాయముతోనే కూడిఉంటున్నాయి. కర్మనాచరించక మనము ఏమాత్రం కూడా వీలుకాదు. ప్రతివ్యక్తికూడను తమ తమ కర్తవ్యమును నిర్వహించాలి. తన కర్తవ్యమును విస్మరించినవాడే పాపి అని చెప్పవచ్చును. ఎవరెవరి కర్తవ్యాన్ని వారు పాటిస్తూ పోయినప్పుడు దేశమంతా సుభిక్షంగా ఉంటుంది. ఎవరికోసమో నీవు యోచించవద్దు. నీ కర్తవ్యమును నీవు ఆచరించు. ఇంకొకరు తన కర్తవ్యాన్ని తాను ఆచరిస్తాడు. అప్పుడు ఒకరికొకరు చెప్పనక్కరలేదు. జడమైన మిషను పనిచేయకపోతే తప్పుపట్టిపోతుంది. మనిషి పనిచేయకపోతే వాడు తుప్పుపట్టడా? పనిచేయని మానవుడు మానవుడేకాదు. ఏదోఒక పనిచేస్తే చాలదు. సమాజ సేవలో పాల్గొనాలి. సమాజ సేవలో పాల్గొను ఇదే సర్వేశ్వరసేవ. భగవంతుని ప్రేమ పొందాలంటే సులభమైన మార్గము అదే. Best way to love God is love all Serve all. అందరినీ ప్రేమించు. అందరిని సేవించు. సేవించేమార్గములో చక్కగా మనం మన జీవితాన్ని పవిత్రం గావించుకోవాలి.

sri sathyasai vachanamrutam

## తేది. 18-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

దివ్యాత్మస్వరూపులారా! అనేకమంది ప్రశాంతి నిలయానికి వస్తారు. ఇంక రేపటినుండి ఎవరు కూడను ఊరికే కూర్చోటానికి వీలులేదు. వారి చేతనైనంత పని మనము సమాజములో చేసి తీరాలి. కేవలము తినటం కూర్చోవటం మాట్లాడటం ఇదే నా మానవత్వమునకు తగిన లక్ష్యము? ఎవరికి చేతనైన పనివారు తప్పక చేయాలి. పని చేయనివారు ప్రశాంతినిలయములో ఉండటానికే వీలులేదు. చేయండి. ఏదైనా ఒకసేవ చేయండి. నిరంతరము Loading unloading ఇదేనా మానవత్వానికి. ఇది సరైనది కాదు. ఈ గురుపూర్ణిమనుండి మీరు చేయవలసినది సేవే ప్రధానమైనది. ఎంతో సేవ చేయవలసి ఉంటున్నాది. ఆ సేవయందే జీవితము సార్థకమవుతుంది. ఈనాడు లోకమంతా ఇలాంటి దురవస్థలకు గురికావటానికి కారణం ఏమిటి? సేవకత్వము నేర్చుకొనకుండా నాయకత్వములోకి పోవటం చేతనే ఈ దురవస్థలు సేవచేయనివాడు నాయకుడు కావటానికి ఏమాత్రము అర్హుడు కాదు. సేవకత్వమే నాయకత్వము నందిస్తుంది. కింకరత్వమే శంకరత్వాన్ని పోషిస్తుంది. నేను గొప్పవాడినని అహంకారమునకు అవకాశము ఇవ్వకూడదు. ఈనాడు ధనము చేత బలవంతుడు కాడు. జనముచేత బలవంతుడు కాదు. నిజమైన బలము ఏమిటి? Morality and purity are the only strength. ఇదే మానవుని నిజమైన బలము. దేహబలము ఉండియేమి ప్రయోజనము. గుండుమోయవచ్చు. బండమోయవచ్చు. కాదు మన దుఃఖమును భరించుకునే బలము నిజమైన బలము. సత్శీలవంతుడు కావాలి. హృదయము పరిశుద్ధముగా ఉంటుండాలి. ఇవి రెండు అభివృద్ధిగావించు కోవాలంటే సేవలో మనము పాల్గొనాలి. ఈ సేవలో పాల్గొనేటప్పటికి అహంకారము నిర్మూలమై పోతుంది. మన అహంకారము నిర్మూలముగావించుకోవాలంటే సేవలో మనము పాల్గొనాలి. అప్పుడు మన జీవితము సార్థకమవటమే కాకుండా మనదేశమునకు ఆదర్శవంతమైన జీవితము అందించినవారమవుతాము.

### సేవచేసి తరించండి

ఈనాడు అనేకమంది ఆఫీస్ బేరర్సు అందరికి ఉపదేశిస్తున్నారుగాని వారు తమ పనులలో చేరటం లేదు. ప్రతి ఒక్కరు worker కావాలిగాని యజమాని కాకూడదు. అప్పుడే నిజమైన



srisathyasaivacharamrutam

క్షేమము దేశానికి కోరినవారమవుతాము. అప్పుడే నిజమైన మానవత్వము పోషించినవారమవుతాము. ప్రతి ఒక్కరు సేవలో పాల్గొనాలి. ఇతరులకు మనము ఏమి చెప్తున్నామో దానిని మనము చేసి చూపించాలి. దానిని నేను చేస్తున్నాను. అందువల్లనే నేను చెప్పటానికి తగిన ఇదిగా ఉంటుంటాది. అందరిని ప్రేమించండి అంటాను. నేను అందరిని ప్రేమిస్తాను. నేను తెల్లవారి మొదలు రాత్రివరకు పనిచేస్తూ ఉంటాను. ఎంత ఉల్లాసముగా ఉంటాను మీకు తెలుసునా! మీకు తెలియదు. Happyness is my form. నేనెప్పుడు ఆనందముగానే ఉంటాను. దేనికి యోచించను. కారణము ఏమిటి? ఏ ఆశలు లేవు. అది నిజమైన ఆనందమునకు కారణము. ఆశలు పెంచుకొని పోవటం చేతనే ఆనందము తరిగి తరిగి పోతుంది.

ప్రేమస్వరూపులారా! ఒకరినొకరు ప్రేమించాలి. ప్రేమించటమంటే లోక సంబంధమైన ప్రేమలు కాదు. స్వామి చెప్పాడని ఈ దుర్మార్గములో ప్రవేశించకండి. అందరియందు ఉన్న ఆత్మ ఒక్కటే అనే సమత్వముతో ప్రేమించాలి. ఏ సాధనలు చేయకపోయినా ఫరవాలేదు. ఆ ప్రేమయే ఉన్నతస్థాయికి గొనిపోతుంది. ఎవరిని బాధించకుండా చూసుకోండి. ఎవరిని బాధించినా దైవమును బాధించినట్లుగా భావించండి. కనుక ఈవిధమైన సమభావమును పెంచుకుంటే ఇదే ఐక్యతకు మూలకారణము. ఏపనిచేసినా లోపలనైనా బయటనైనా నామస్మరణచేయండి. నామమే ఈ సంసారసాగరమును దాటించేనావ. తుచ్ఛమైన, బలహీనమైన మాటలచేత ఏమాత్రము ప్రయోజనము లేదు. కాలము భగవత్ స్వరూపము. Don't waste time. Time waste is life waste. Time is God. ఈ దైవత్వమును మనము చక్కగా విశ్వసించి ఆ కాలమునే భగవత్ స్వరూపముగా విశ్వసించాలి.

**(తేది. 18-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam